## క్లుప్తంగా

### విద్యార్థుల తల్లులకు సన్మానం



పాన్‌గల్: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తల్లులకు హెచ్‌ఎం పద్మ, ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. విద్యార్థులచే వారి తల్లులకు పాదాభివందం చేయించారు. ఇంటికి దీపం ఇల్లాలు, ఇల్లాలు వెలుగుతోనే ఆ కుటుంబం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో పయనిస్తుందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

### ఉపాధి కూలీలు జాగ్రత్తగా ఉండాలి



చిన్నంబావి: వేసవి కాలం కావడంతో ఎండలు మండిపోతున్నాయని, ఉపాధి కూలీలు పని ప్రదేశంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ రమణరావు సూచించారు. ఆయన మండలంలోని పెద్దమారులో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు పెరిగినందున కూలీలు పనులకు ఉదయం తొందరగా వచ్చి మధ్యాహ్నం వరకు ఇళ్లకు చేరుకోవాలని సూచించారు. పని ప్రదేశంలో తాగునీరు, నీడకు షెడ్, ఫస్ట్ ఎయిడ్ కిట్ అందుబాటులో ఉంచాలని సిబ్బందికి ఆదేశించారు. ఎవరైన ఎండతాపానికి గురైతే వెంటనే వైద్యుల వద్దకు తీసుకెళ్లాలన్నారు. అనంతరం గ్రామంలో ఉన్న నర్సరీని పరిశీలించారు.

### ఎల్వోసీ అందజేత



మదనాపురం: మండలంలోని దుప్పల్లికి చెందిన సుతారి కృష్ణ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ హైదరబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడికి మెరుగైన చికిత్స కోసం సీఎం సహాయనిధి నుంచి రూ.2.75లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. అందుకు సంబంధించిన ఎల్‌ఓసీని శుక్రవారం ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి హైదరాబాద్‌లోని తన నివాసంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

### ‘కబ్జాలు ఆపాలి’

ఆత్మకూర్: పట్టణంలోని ప్రభుత్వ స్థలాల్లో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలు తొలగించాలంటూ సీపీఐ నాయకులు చేపట్టిన నిరవధిక నిరసన శుక్రవారం 8వరోజు కొనసాగింది. అక్రమ కట్టడాలను కూల్చేంత వరకు పోరాటాన్ని ఉధృతంగా చేపడతామని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు అన్నారు. ఈ విషయమై హైకోర్టు నాలుగు వారాల్లో సమగ్రమైన విచారణ చేపట్టి కోర్టుకు నివేదించాలని మున్సిపల్ అధికారులకు ఆదేశించడంతో నిరసనను తాత్కాలికంగా విరమించుకుంటున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో శ్రీహరి, మోష, సీఎస్‌శెట్టి, అబ్రహం, భాస్కర్, కుతుబ్, రవీందర్, శేఖర్, శ్యాంసుందర్, లక్ష్మీనారాయణశెట్టి, కుమార్, బాలస్వామి, రాంచందర్, గీత, కృష్ణవేణి, పద్మ, మాసమ్మ, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కరించాలని ధర్నా

అమరచింత: మండలంలోని పాంరెడ్డిపల్లిలో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా సీపీఎం మండల నాయకుడు వెంకటేష్ మాట్లాడుతూ ఐదు రోజుల కిందట సీపీఎం ఆధ్వర్యంలో గ్రామంలోని సమస్యలను గుర్తించి పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. గ్రామంలో నూతన వాటర్ ట్యాంక్ నిర్మించి ప్రజలకు తాగునీరు అందించాలని, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్లను అమరచింత పోస్ట్ ఆఫీస్‌లో ఇస్తుండడంతో అక్కడికి వెళ్లడానికి వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలోనే పెన్షన్లు అందించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామంలో సీసీ రోడ్డు, కొన్ని కాలనీలకు తాగునీటి వసతి లేదన్నారు. పారిశుద్ధ్య పనులు, ఫాగింగ్ చెపట్టి దోమలు, ఈగలను నివారించాలని కోరారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి షర్ఫుద్దీన్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మోహన్, రాజు, నాగరాజు, మహేష్, అశోక్, బాలకృష్ణ, శివరాజ్, రంగారెడ్డి, మొగిలి, అనంతమ్మ తదితరులు పాల్గొన్నారు.



### మహిళల ప్రాతినిధ్యం పెరగాలి



ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. కానీ కొన్ని వర్గాల్లో ఇప్పటికీ మహిళలపై వివక్ష కొనసాగుతోంది. ఈ పరిస్థితుల్లో మార్పు రావాల్సిన అవసరం ఉంది. ఉద్యోగ, రాజకీయాల్లో మహిళల ప్రాతినిధ్యం మరింత పెరగాలి. అందుకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. ముఖ్యంగా బాల్యవివాహాల కారణంగా అమ్మాయిలు చదువుకు దూరం అవుతున్నారు. బాల్యవివాహాల నిర్మూలనపై తల్లిదండ్రుల్లో అవగాహన పెంచాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

– సద్గుణ, ఎంపీడీఓ, పెద్దమందడి

### కష్టపడే మనస్తత్వం ఉండాలి



కష్టపడే మనస్తత్వాన్ని అలవర్చుకున్నప్పుడే మహిళలు, బాలికలు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారు. విద్యలో రాణించాల్సిన వయసులో బాలికలు తాత్కాలిక సంతోషాలకు దూరంగా ఉండాలి. మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుంటే ‘అబలలు కాదు సబళలు’ అని నిరూపించవచ్చు. పేదరికంలో పుట్టిన నేను కుటుంబ సభ్యుల సహకారంతో కష్టపడి చదవటం వల్లే నేడు ఈ స్థాయిలో ఉన్నాను.

– కె రాణి, సబ్ ఇన్‌స్పెక్టర్, వీపనగండ్ల

# నిరంతరం వెలుగులు!

- ఆన్ ఆఫ్ స్విచ్‌లు లేకపోవడంతో వీధి దీపాలకు వృథా అవుతున్న విద్యుత్
- జీపీలకు బిల్లుల మోత
- రూ.2.10 కోట్లు పెండింగ్



పాన్‌గల్ విద్యుత్ సబ్‌స్టేషన్

పాన్‌గల్: రాత్రి వేళ మాత్రమే వెలుగుతూ ఉండాల్సిన వీధి దీపాలు చాలా గ్రామాల్లో 24 గంటలూ వెలుగుతూనే ఉన్నాయి. ఆన్‌ఆఫ్ స్విచ్‌లు లేకపోవడంతో వాటిని తెల్లవారగానే ఆర్పే పరిస్థితి లేదు. దీంతో అవి పగటి పూట కూడా వెలుగుతూ కరెంటును వృథా చేస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో మాత్రం ఆన్‌ఆఫ్ స్విచ్‌లు లేకపోయినా తెల్లవారగానే కరెంటు కనెక్షన్ తొలగించి దీపాలను ఆర్పేస్తున్నారు. పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా రాత్రింబవళ్లు వెలుగుతుండడంతో వీధిదీపాలు పాడైపోతున్నాయి. మళ్లీ వాటిని తిరిగి పునరుద్ధరించేందుకు పంచాయతీ ఖజానాపై భారం పడుతోంది.

**ఇదీ పరిస్థితి..**

ఆన్‌ఆఫ్ స్విచ్‌లు ఒకే చోట ఉంటే ఎవరో ఒకరు మాత్రమే దీపాలను ఆర్పటం వీలవుతుంది. ఇందుకోసం స్తంభాలపై ప్రత్యేకంగా వీధి దీపాలకు కరెంటు లైన్ వేయాల్సి ఉంది. ప్రస్తుతం ట్రాన్స్‌కో అదనపు లైన్ సమకూర్చే పరిస్థితి కనిపించడం లేదు. గ్రామాల నుంచి ఎన్ని ఫిర్యాదులు వచ్చినా అటు పంచాయతీలు, ఇటు ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోవడం మానేశారు.

**మండలంలో..**

మండలంలో ఆరు విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. వాటి పరిధిలో ఉండే 28 గ్రామాలు ఉండగా.. వాటిలో సగానికి పైగా ఆన్‌ఆఫ్ స్విచ్‌లు లేవని తెలుస్తోంది. అంటే నిత్యం ఒక గ్రామంలోనే వందల



పాన్‌గల్‌లో నిరంతరం వెలుగుతున్న వీధి దీపాలు

యూనిట్లలో కరెంటు వృథా అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలోని 28 జీపీల విద్యుత్ బిల్లులు రూ.2.10 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయంటే వీధి దీపాల వలన ఎంత విద్యుత్ వృథా అవుతుందో అర్థమవుతుంది.

**బాధ్యత ఎవరిది?**

గ్రామ పంచాయతీల్లో వీధి దీపాలకు ఆన్‌ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేసే బాధ్యత మీదంటే మీదంటూ పంచాయతీ, ట్రాన్స్‌కో సిబ్బంది వాదించుకుంటున్నారు. ఇలా విద్యుత్ వీధి దీపాలు నిరంతరం వెలుగుతున్నా క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లేక ఈ పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా విద్యుత్, పంచాయతీ అధికారులు గ్రామాల్లో పర్యటించి విద్యుత్ వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

#### ప్రత్యేక లైన్ ఏర్పాటు చేయాలి



గ్రామాల్లో వీధి దీపాలు నిరంతరం వెలుగకుండా ప్రత్యేక లైన్లు ఏర్పాటు చేయడంతో పాటు ఆన్‌ఆఫ్ స్విచ్‌లు బిగించాలి. దీంతో విద్యుత్ వృథాను అరికట్టే అవకాశం ఉంది. విద్యుత్ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

– రాములు, మాజీ సర్పంచ్, అన్నారం

#### విద్యుత్ వృథాను అరికట్టాలి



మండలంలోని చాలా గ్రామాల్లో వీధి దీపాలు నిరంతరం వెలుగుతుండటంతో విద్యుత్ వృథా అవుతుంది. ట్రాన్స్‌కో, పంచాయతీ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ వీధి దీపాలపై పర్యవేక్షణ పెంచాలి. ఇప్పటికైనా అధికారులు పర్యవేక్షణ చేస్తూ విద్యుత్ వృథాను అరికట్టేందుకు తగు చర్యలు తీసుకోవాలి.

– అంజనేయులు, డీవైఎఫ్‌ఐ జిల్లా నాయకులు, రేమద్దుల

#### ఆన్ ఆఫ్ స్విచ్చులు బిగిస్తాం



చాలా గ్రామాల్లో ప్రత్యేక లైన్లు ఉన్నా ఆన్‌ఆఫ్ స్విచ్‌లు లేకపోవడంతో వీధి దీపాలు నిరంతరం వెలుగుతున్నాయి. ఆన్‌ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేసుకొని ఉదయం ఆఫ్ చేసుకొని.. చీకటి పడగానే ఆన్ చేసుకునే బాధ్యత పంచాయతీలదే. అది వారు విస్మరిస్తున్నారు. ఆన్‌ఆఫ్ స్విచ్‌లు ఉన్న గ్రామాల్లో కూడా వాటిని సరిగా వినియోగించడంలేదు. మరోమారు అన్ని జీపీల్లో క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి విద్యుత్ వృథా కాకుండా తగు చర్యలు తీసుకుంటాం.

– చందన్‌కుమార్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ, పాన్‌గల్

### మిర్చికి గిట్టుబాటు ధర కల్పించాలి



అమరచింత: మిర్చి పండించిన రైతులకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామ సమస్యల సర్వే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని చంద్రప్పతండా పంచాయతీని సందర్శించి, గ్రామంలోని సమస్యలను ప్రజలతో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు అజయ్, ఆర్‌ఎస్ రమేష్ మాట్లాడుతూ రైతులు ఎన్నో కష్టాలు, నష్టాలను భరిస్తూ ఈసారి మిర్చి పంటను సాగు చేశారన్నారు. సకాలంలో మందులు పిచికారీ చేసినా తెగుళ్ల అదుపుకాకపోవడంతో దిగుబడి తగ్గిందన్నారు. పండిన కొద్దిపాటి మిర్చినైనా అమ్ముకుందామనుకుంటే మార్కెట్‌లో సరైన ధరలు లేకపోవడంతో వరంగల్, హైదరాబాద్ మార్కెట్లకు వెళ్లాల్సిన పరిస్థితులు దాపరించాయన్నారు. ప్రభుత్వం మిర్చి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. చంద్రప్పతండాలో నేటికీ సొంతంగా పంచాయతీ కార్యాలయం లేకపోవడం శోచనీయం అన్నారు. గిరిజనుల అభివృద్ధిని ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. విద్యుత్ లోఓల్టేజీ సమస్య వేధిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీసీ రహదారులతో పాటు డ్రెయినేజీల నిర్మాణాలను చేపట్టాని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకటేష్‌నాయక్, పుల్యానాయక్, హరియానాయక్, లింగనాయక్, పాండునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## హామీల అమలు కోసం ఉద్యమిస్తాం

వీపనగండ్ల: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నో హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలుచేయడంలో విఫలం అయ్యిందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ జబ్బార్ అన్నారు. శుక్రవారం గోపల్‌దిన్నెలో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన రిలే నిరహార దీక్షల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. రాష్ట్రంలోని రైతులు పండించిన సన్న వడ్లకు బోనస్ ఇస్తామని చెప్పి 20 శాతం డబ్బులు మాత్రమే రైతుల ఖాతాల్లో వేసిందని, దాదాపు 40 శాతం మంది రైతులకు రుణమాఫీ జరుగలేదని, రైతు భరోసా పథకం పూర్తి స్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. గోపల్‌దిన్నె గ్రామానికి సరైన రోడ్డు వసతి, బస్సు సౌకర్యాలు లేవని, గ్రామంలో దళిత, బీసీ వర్గాలకు భూ తగాదాలు ఉన్నాయని, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల పంపిణీ



గోపల్‌దిన్నెలో మాట్లాడుతున్న ఎండీ జబ్బార్

అమలు కావడం లేదని ధ్వజమెత్తారు. రాబోయే రోజుల్లో తమ పార్టీ ఆధ్వర్యంలో ప్రజలను చైతన్య పరిచి ప్రజా ఉద్యమాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి బాల్‌రెడ్డి, నాయకులు పెద్ద ఖాజా, భాస్కర్, శేఖర్‌రెడ్డి, వెంకటయ్య, నిరంజన్, చంద్రయ్య, రాముడు, కురుమయ్య, కృష్ణయ్య, శ్రీనివాసులు, మౌలాలి, నాగన్న, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

### మిషన్ భగీరథ పైప్‌లైన్ల లీకేజీ

అమరచింత: పట్టణంలోని మిషన్ భగీరథ సంప్ హౌజ్ నుంచి కొంకన్‌వానిపల్లి వరకు వెళ్తున్న మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ కారణంగా రెండు రోజులుగా ఆయా గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. మున్సిపాలిటీలోని ఐదు ఓవర్‌హెడ్ ట్యాంకులతో పాటు పాంరెడ్డిపల్లి, కొంకన్‌వానిపల్లి గ్రామాలకు తాగునీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన పైప్‌లైన్ లీకేజీల కారణంగా నీరు వృథాగా రహదారులపై పారుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడంతో తాగునీటి సమస్య తీవ్రం అయ్యింది. పట్టణంలోని సవరమ్మ ఆలయం నుంచి షామిల్ వరకు మూడు చోట్ల పైప్ లీకేజీల కారణంగా నీటి కుంటలు ఏర్పడ్డాయి. దీనిపై ప్రజలు ఫిర్యాదు చేసినా మిషన్ భగీరథ, మున్సిపల్ వాటర్ లైన్‌మెన్లు ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ దాటవేయడంతోనే సరిపెట్టారు. దీంతో లీకేజీల గురించి పట్టించుకోరా.. అంటూ మున్సిపల్ కమిషనర్ రవిబాబుకు పట్టణ ప్రజలు కోరడంతో శుక్రవారం లీకేజీలను గుర్తించే పనులకు శ్రీకారం చుట్టారు. ప్రధానంగా మిషన్ భగీరథ పైప్‌లైన్‌కే లీకేజీలు ఉన్నాయని గమనించడంతో మున్సిపల్ వాటర్ లైన్‌మెన్లు విషయాన్ని కమిషనర్‌కు విన్నవించారు. విషయాన్ని కమిషనర్ మిషన్ భగీరథ ఏఈకి వివరించడంతో లీకేజీల మరమ్మతు పనులు ప్రారంభించారు.



పైప్‌లైన్ మరమ్మతు చేస్తున్న సిబ్బంది

## ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య

పాన్‌గల్: నాణ్యమైన విద్య కోసం తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని ఎంపీడీఓ గోవింద్‌రావు సూచించారు. శుక్రవారం మండలంలోని తెల్లరాళ్లపల్లితండా ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన స్వయం పాలన దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు ఉన్నత విద్య, శిక్షణ పొందిన వారు ఉండటంతో విద్యార్థులకు మంచి విద్య అందుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులే గొప్ప ప్రయోజకులు అయినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆయన బహుమతులు అందజేశారు. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి తోడ్పాటునందించిన మాజీ విద్యా కమిటీ చైర్మన్ బాల్యానాయక్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం గిరిజన సంప్రదాయ దుస్తులు ధరించి విద్యార్థులు చేసిన నృత్యం పలువురిని అకట్టుకుంది. కార్యక్రమంలో ఎంపీఓ రఘురాములు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ చిట్టెమ్మ, హెచ్‌ఎం అరుణ, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**రేమద్దులలో స్వయం పాలన దినోత్సవం**

రేమద్దుల ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డీఈఓగా భవ్యశ్రీ, ఎంఈఓగా చరణ్, హెచ్‌ఎంగా సాయికుమార్‌తో పాటు 25 మంది విద్యార్థులు



తెల్లరాళ్లపల్లితండా ప్రాథమిక పాఠశాలలో గిరిజన వేషధారణలో విద్యార్థుల నృత్యం

ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు బస్తీరాం, రమేష్‌యాదవ్, శ్రీనివాసులు, లక్ష్మయ్య, అస్మనాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

వనపర్తి రూరల్: మండలంలోని చిట్యాల ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉత్తమంగా విద్యా బోధన చేసిన విద్యార్థులకు హెచ్‌ఎం చంద్రశేఖర్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గణేష్‌కుమార్, శంకర్‌గౌడ్, చైర్‌పర్సన్ శివమ్మ, ఉపాధ్యాయులు జితేందర్, సత్యనారాయణరెడ్డి, సతీష్, శిరీష, సుచరిత, శోభ పాల్గొన్నారు.

ఆత్మకూర్: మండలంలోని మేడేపల్లి ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాములు, సీఆర్పీ సౌమ్యరాణి, ఉపాధ్యాయులు నాగరాజు, రాధ, విద్యార్థులు పాల్గొన్నారు.

### సొమ్ములు స్వాహా

గోపాల్‌పేట: ఉదయం ఇంటి నుంచి వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చేసరికి ఇంట్లో సొమ్ములు మాయమైన ఘటన రేవల్లి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. రేవల్లి ఎస్‌ఐ రాము తెలిపిన వివరాల మేరకు.. రేవల్లి మండల కేంద్రానికి చెందిన అన్నలదాసు లక్ష్మి మాసయ్య భార్యభర్తలు. గురువారం ఉదయం మాసయ్య పెళ్లికి వెళ్లగా.. భార్య లక్ష్మి రేమొద్దులలోని ఆలయానికి వెళ్లింది. వారు సాయంత్రం వచ్చే సరికి బీరువాలోని మొత్తం 35 తులాల వెండి, మూడు మాసాల బంగారం కనిపించలేదు. శుక్రవారం లక్ష్మి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించామని ఎస్‌ఐ తెలిపారు.

### ‘నిందితుడిపై చర్యలు తీసుకోవాలి’

వనపర్తి రూరల్: జగిత్యాల జిల్లాలోని రాయికల్‌లో ఆశావర్కర్‌పై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సీపీఎం(ఎం) జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు ఓ ప్రకటనలో కోరారు. రాయకల్‌లో దళిత మహిళ అయిన ఆశావర్కర్ డ్యూటీ పూర్తిచేసుకొని ఇంటికి వెళ్తుండగా కామంధుడు దౌర్జన్యం చేసి, బెదిరించి అత్యాచారానికి పాల్పడ్డాడని మండిపడ్డారు. ఘటన జరిగిన వారం రోజులవుతున్నా నిందితుడిని పోలీసులు ఇప్పటికీ అరెస్టు చేయలేదని ఆరోపించారు. పోలీసుల నిర్లక్ష్యం, ప్రభుత్వం కఠినంగా వ్యవహరించకపోవడంతో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వ యంత్రాగం అప్రమత్తంగా వ్యవరించి, చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళల రక్షణ కోసం తగిన చర్యలు తీసుకోవాలని సీపీఎం(ఎం) జిల్లా కమిటీ డిమాండ్ చేస్తుందన్నారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి నిందితుడిని కఠినంగా శిక్షించి, బాధితురాలికి సరైన వైద్యం అందించడంతో పాటు ప్రభుత్వం నుంచి సాయం అందించాలని కోరారు.

### విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించేందుకు..

వీపనగండ్ల: ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలు, పోటీ పరీక్షల వల్ల విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీస్తుందని ఎస్‌ఐ రాణి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ పాఠశాల ఆవరణలో నిర్వహించిన వార్షికోత్సవంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల్లోనూ ప్రభుత్వం అన్ని రకాల వసతులను కల్పిస్తుందని, దీంతో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు కూడా పోటీ పరీక్షల్లో రాణిస్తున్నారని తెలిపారు. వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు ఎస్‌ఐ మెమోంటోలను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సాయిలత, ఉపాధ్యాయులు రంజిత్‌గౌడ్, భారతి, దేవేందర్, రవికుమార్, స్వప్న పాల్గొన్నారు.



## ‘పది’ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

వనపర్తి: పదోతరగతి వార్షిక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులకు పరీక్షల నిర్వహణపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. పరీక్షల నిర్వహణలో చీఫ్ సూపరింటెండెంట్లదే ప్రధాన పాత్ర అన్నారు. కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీరు, ఫ్యాన్లు, మరుగుదొడ్లు తదితర సౌకర్యం కల్పించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ నెల మార్చి 21 నుంచి ఏప్రిల్ 2 వరకు పరీక్షలు జరగనున్నాయని.. జిల్లావ్యాప్తంగా 36 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మొత్తం 6,853 మంది విద్యార్థులు హాజరుకానున్నారని.. కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, చేతి గడియారాలను అనుమతించొద్దని సూచించారు. సమావేశంలో డీఈఓ అబ్దుల్ ఘని, ఆర్డీఓ సుబ్రమణ్యం, ఏసీజీ గణేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

## 1,002 మందికి మధుమేహ పరీక్షలు

పాన్‌గల్: షుగర్ వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు నిర్వహిస్తున్న మధుమేహ పరీక్షలు మండలంలో కొనసాగుతున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్, సీహెచ్‌ఓ రామయ్య పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మంగళ్లపల్లి, గన్యానాయక్‌తండాలో కొనసాగుతున్న పరీక్షలను సీహెచ్‌ఓ రామయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 30 ఏళ్లు దాటినవారందరూ పరీక్షలు చేయించుకొని సిబ్బందికి సహకరించాలని కోరారు. ఒకవేళ వ్యాధి నిర్ధారణ అయితే ఆహారపు అలవాట్లను మార్చుకొని వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలని సూచించారు. మండలంలోని 10 సబ్‌సెంటర్ల పరిధిలో సిబ్బంది 1,002 మందికి పరీక్షలు నిర్వహించినట్లు వారు పేర్కొన్నారు.

**జనరిక్ ఔషధాలపై అవగాహన**

మండల కేంద్రంలో ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి పరియోజనలో భాగంగా శుక్రవారం జనరిక్ ఔషధాలపై పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రామయ్య, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జనరిక్ ఔషధాల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

## సోళీపురంలో 85 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



సోళీపురం శివారులో పోలీసులు గుర్తించిన రేషన్ బియ్యం బస్తాలు



మదనాపురంలో..

ఖిల్లాఘనపురం: మండలంలోని సోళీపురం గ్రామ సమీపంలో 85 ప్లాస్టిక్ బస్తాల రేషన్ బియ్యాన్ని శుక్రవారం రాత్రి పోలీసులు గుర్తించినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సోళీపురం నుంచి కోతులకుంట తండాకు వెళ్లే దారిలో గ్రామానికి చెందిన బొంగు శ్రీను వ్యవసాయ పొలంలో పశువుల పాక వద్ద 85 ప్లాస్టిక్ సంచుల్లో రేషన్ బియ్యం ఉంచి పైన టార్పాలిన్ కవరు కప్పి ఉంచారు. విషయం తెలుసుకున్న ఎస్‌బీ కానిస్టేబుల్ శేఖర్, హెడ్‌కానిస్టేబుల్ బొట్టు శ్రీనుతో పాటు సిబ్బంది దాడి చేసి పట్టుబడిన 85 సంచుల బియ్యాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ప్లాస్టిక్ సంచుల్లో కొన్ని నిండుగా, మరి కొన్ని సగం వరకు బియ్యం ఉండటంతో మొత్తం ఎన్ని క్వింటాళ్లు ఉన్నాయనేది గుర్తించలేదని పోలీసులు పేర్కొన్నారు. ఘటనపై గ్రామంలో విచారణ చేపట్టారు. పశువుల పాక యజమాని బొంగు శ్రీను ను ఈ విషయం గురించి అడగగా తాను రెండు రోజులుగా గ్రామంలో లేనని, చుట్టాల ఊరికి వెళ్లినట్లు తెలిపారు. ఆయన జీతగాడు కుర్మయ్య అక్కడ ఉన్నప్పటికీ ఆయన గ్రామానికి చెందిన కానందున గ్రామస్తులు ఎవ్వరూ అతడికి తెలియకపోవడంతో ఎవరో బియ్యం బస్తాలు ఇక్కడ వేసి వెళ్లారని చెబుతున్నట్లు శ్రీను చెప్పాడు. ఈ విషయమై ఎస్‌ఐ సురేష్‌గౌడు ఇప్పటికే బియ్యం ఎవరివని విచారణ ప్రారంభించారు. కాగా ఇటీవల సోళీపురంలో ఓ వ్యక్తికి సంబంధించి ఎక్కువ మొత్తంలో రేషన్ బియ్యం దొరికితే తన పలుకుబడితో తక్కువ చూయించినట్లు గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

**9 క్వింటాళ్ల రేషన్ బియ్యం..**

మదనాపురం: అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న ఆటోను మదనాపురం పోలీసులు రైల్వే గేట్ వద్ద శుక్రవారం పట్టుకున్నారు. విధులో భాగంగా వాహనాలను తనిఖీ చేస్తుండగా.. ఆత్మకూర్ వైపు నుంచి మదనాపురం వైపు వస్తున్న ఆటోను పరిశీలించారు. ఆటోలో 9 క్వింటాళ్ల రేషన్ బియ్యం కనిపించడంతో డ్రైవర్‌ను విచారించగా.. అమరచింత పట్టణానికి చెందిన వెంకటేష్ కు చెందిన బియ్యంగా నిర్ధారించారు. ఆటోని పోలీస్‌స్టేషన్‌కు తరలించి సివిల్ సప్లై అధికారులకు సమాచారం ఇచ్చారు. సివిల్ సప్లై తహసీల్దార్ పరమేష్ బియ్యాన్ని పరిశీలించి రేషన్ బియ్యం అని నిర్ధారించారు. ఆయన ఫిర్యాదు మెరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపాడు.